క్లుప్తంగా

రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలంలోని ఆయా పీఏసీఎస్ కార్యాలయాల్లో రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ విస్తరణ అధికారి కళ్యాణి అన్నారు. శనివారం స్థానికంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. 30 కేజీల జీలుగ విత్తనాల బ్యాగు ధర రూ.842.70గా ఉందని, అవసరమైన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డుతో ఆయా పీఏసీఎస్ కార్యాలయాలను సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాని సూచించారు.

మృతులు, క్షతగాత్రుల కుటుంబాలను ఆదుకోవాలి

మిర్యాలగూడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా పొందుగుల వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో దామరచర్ల మండలానికి చెందిన ఏడుగురు మహిళా కూలీలు మృతిచెందగా, 17మంది క్షతగాత్రులయ్యారు. వీరికి ప్రధాన మంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని కేంద్ర పర్యాటకశాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లో బీజేపీ మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ ప్రభారి గోగిరెడ్డి లచ్చిరెడ్డి కలిసి విన్నవించారు. దీనిపై కేంద్ర మంత్రి స్పందిస్తూ.. మృతుల, క్షతగాత్రుల కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం తరఫున తప్పక ఆదుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

జానారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లోకి..



కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి

నాగార్జునసాగర్: నందికొండలోని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి నివాసంలో శనిఆరం బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి జానారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశబూరు. పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో నిడమనూరు మండలం శాఖాపురం మాజీ సర్పంచ్ చేకూరి వంశీచరణ్, కోలా శ్యాం, గంటా జానకిరాములు,షేక్ రషీద్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకుడు తుమ్మలపల్లి రంగారెడ్డి ఉన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక



స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కొండమల్లేపల్లి: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షలో మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన 13మంది విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం మంద సత్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. 2022 డిసెంబర్‌లో జరిగిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో పాఠశాలకు చెందిన కొర్ర మహేందర్, సీహెచ్. జస్వంత్, పి. కావ్య, ఎస్. అనిల్, ఎం. రామకృష్ణ, ఆర్. చందులాల్, ఎస్. ఉజ్వల, ఎ. అశోక్, ఈ. హేమంత్, వి. శిరీష, ఎస్. స్పందన, ఎ. అజయ్, కె. చరణ్ ఎంపికైనట్లు తెలిపారు. వీరికి నాలుగు సంవత్సరాల పాటు ఏడాదికి రూ.12,000 చొప్పున స్కాలర్‌షిప్ అందనున్నట్లు పేర్కొన్నారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను ప్రోగ్రాం ఇన్‌చార్జి డి. సైదానాయక్, ఉపాధ్యాయులు కొర్ర లోక్యానాయక్, నల్లా నర్సింహ, దేవి తదితరులు అభినందించారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు



తలపడుతున్న ఖమ్మం-నల్లగొండ జట్లు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల మహిళా కబడ్డీ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. తిరుమలగిరి మండలంతో పాటు పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పోటీలను వీక్షిస్తున్నారు. ఈ పోటీలు రాత్రి 12.00 గంటల వరకు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో మ్యాట్‌పై జరుగుతున్నాయి. ఆదివారం సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. అనంతరం గెలుపొందిన జట్లుకు మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి చేతులమీదుగా బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కన్నీళ్లు మిగిల్చిన ఈదురుగాలులు



పెద్దవూర: గేదె కళేబరం వద్ద విలపిస్తున్న రైతులు



చందంపేట: సీత్యతండాలో పిడుగుపాటుకు మృతిచెందిన ఎద్దు



చందంపేట: కోరుట్లలో ఈదురు గాలులకు ఎగిరిపోయిన ఇంటి పైకప్పు

- పిడుగుపాటుకు మూగజీవాలు మృతి
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పులు

దేవరకొండ: దేవరకొండలో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. దీంతో గత వారం రోజులుగా తీవ్రమైన ఎండవేడిమితో అల్లాడుతున్న ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. ఈదురు గాలులతో పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

చింతపల్లిలో..

చింతపల్లి: మండలంలో గాలివాన బీభత్సం సృష్టించింది. శనివారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. మండల కేంద్రంలో విద్యుత్ తీగలు తెగిపడగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నసర్లపల్లి, వెంకటంపేట గ్రామాల్లో ఇటుక బట్టీల వ్యాపారులకు వర్షం కారణంగా లక్షల రూపాయల్లో నష్టం వాటిల్లింది.

పిడుగుపడి గేదె మృతి

పెద్దవూర: పిడుగుపాటుతో గేదె మృతి చెందిన ఘటన శనివారం సాయంత్రం మండలంలోని గేమ్యానాయక్‌తండా గ్రామపంచాయతీ పరిధిలోని జగ్‌రాంతండాలో చోటుచేసుకుంది. వివరాలు.. జగ్‌రాంతండాకు చెందిన రమావత్ హరి తన పశువులను మేపటానికి వ్యవసాయ పొలానికి తోలుకొని వెళ్లాడు. ఈ క్రమంలో సాయంత్రం సమయంలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో పొలంలోని వేప చెట్టుపై పిడుగు పడటంతో వర్షానికి చెట్టుకిందకు వచ్చిన గేదె అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ రూ.80వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు.

సీత్యతండాలో ఎద్దు మృతి

చందంపేట: మండలంలోని బిల్డింగ్‌తండా గ్రామ పంచాయతీ పరిధిలోని సీత్యతండా వాసి కుమార్‌కు చెందిన ఎద్దు శనివారం పిడుగుపాటుకు మృతి చెందింది. ఎద్దు విలువ రూ.40వేలు ఉంటుందని బాధితుడు పేర్కొన్నాడు.

ఎగిరిపోయిన ఇంటి పైకప్పు

చందంపేట మండలంలోని కోరుట్ల గ్రామంలో ఎలిమినేటి కాశయ్య, శంకరయ్యల ఇంటి పైకప్పు రేకులు ఈదురుగాలులకు ఎగిరిపోయాయి. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సంక్షేమంలో తెలంగాణ దేశానికే ఆదర్శం

- దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్



లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శనివారం దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాలకు చెందిన 65మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.15.60లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడారు. ఆపద సమయాల్లో నిరుపేదలను సీఎం రిలీఫ్ ఫండ్ ఆదుకుంటుందన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో డిండి ఎంపీపీ మాధవరం సునీతాజనార్దన్‌రావు, జెడ్పీటీసీ కేతావత్ బాలూనాయక్, మారుపాకుల సురేష్‌గౌడ్, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, టీవీఎన్ రెడ్డి, మునుకుంట్ల వెంకట్‌రెడ్డి, ఆరెకంటి రాములు, గోసుల అనంతగిరి, పొన్నెబోయిన సైదులు, మేకల కాశన్న, వేముల రాజు తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

- నాగార్జునసాగర్ ఎమ్మెల్యే భగత్



హాలియాలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భగత్

హాలియా: బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. ఆర్అండ్‌బీ నిధులు రూ.2.14 కోట్లతో హాలియా మున్సిపాలిటీలోని 3వ వార్డు నుంచి ఆంజనేయ తండా గ్రామం వరకు చేపట్టనున్న బీటీ రోడ్డు, సీసీ రోడ్డు నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కోట్లాది రూపాయలు వెచ్చించి సాగర్ నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్నారన్నారు. గతంలో ఏళ్ల తరబడి పాలించిన నాయకులు కనీసం రోడ్ల అభివృద్ధిపై కూడా దృష్టి పెట్టలేదని విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మ, హాలియా మార్కెట్ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మలిగిరెడ్డి లింగారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు చెరుపల్లి ముత్యాలు, కౌన్సిలర్లు అన్నెపాక శ్రీనివాస్, నల్లబోతు వెంకటయ్య, మార్కెట్ డైరెక్టర్ సురభి రాంబాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి దోరేపల్లి వెంకటేశ్వర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని ధర్నా



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు, కిసాన్ మోర్చా నాయకులు

దేవరకొండ: ధాన్యం కొనుగోళ్లను అధికారులు వేగవంతం చేయాలని శనివారం బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో దేవరకొండ ఆర్డీఓ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి కళ్యాణ్‌నాయక్ మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాలు, తరుగు పేరుతో కొర్రీలు పెడుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్, నాయకులు కేతావత్ లాలూనాయక్, మల్లేష్‌నాయక్, వినోద్‌రాథోడ్, గుండాల అంజయ్య, తిరుపతిగౌడ్, రెడ్డి శంకర్, భాస్కర్, దశరథ్ తదితరులున్నారు.

ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కు మాదిగలే బుద్ధి చెప్తారు

మిర్యాలగూడ: మాదిగలపై దాడులు చేయడంతో పాటు అక్రమ కేసులు బనాయిస్తున్న తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కు వచ్చే ఎన్నికల్లో మాదిగలు తగిన బుద్ధి చెప్తారని ఎంఎస్‌పీ మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్‌చార్జి మచ్చ ఏడుకొండలు, ఎమ్మార్పీఎస్ దామరచర్ల మండల అధ్యక్షుడు సందాల శంభయ్య అన్నారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలో వారు మాట్లాడుతూ.. తుంగతుర్తిలో దళితబంధులో జరిగిన అక్రమాలను, ఇసుక మాఫియాను బయటపెట్టిన మాదిగలపై ఎమ్మెల్యే గాదరి కిశోర్ అక్రమ కేసులు బనాయించడం, అనుచరులతో భౌతికంగా దాడులకు పాల్పడడం హేయమైన చర్య అని అన్నారు. ఇప్పటినా ఎమ్మెల్యే కిశోర్ మాదిగలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోట సంజయ్, పోలెపల్లి గోపయ్య, కొమ్ము దాసు, ఆకారపు గోపాల్, పోకల నాగయ్య, కోట చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

మినీ మహానాడుకు భారీగా తరలిరావాలి

మిర్యాలగూడ టౌన్: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మిర్యాలగూడలోని శ్రీమన్నారాయణ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న నల్లగొండ పార్లమెంట్ స్థాయి మినీ మహానాడుకు భారీగా జన సమీకరణ చేయాలని పార్టీ పట్టణ కన్వీనర్ వడ్డెబోయిన శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ మినీ మహానాడుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు నసీరుద్దీన్‌బాబా, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకుడు మచ్చ సైదులు, బీసీ సెల్ నాయకుడు చావల వెంకటేశ్వర్లు, వాణిజ్య సెల్ నాయకుడు ఏచూరి అనంతరాములు, ఎస్టీ సెల్ నాయకులు రమేష్‌నాయక్, గంధం సత్యనారాయణ తదితరులున్నారు.

సాయినాథుడి వార్షికోత్సవాలు ప్రారంభం



హోమం ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చింతపల్లి: హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై చింతపల్లి మండల కేంద్రంలో కొలువుదీరిన షిర్డీ సాయినాథుడి 16వ వార్షికోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం గణపతి ప్రార్థన, గో పూజ, యోగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ తదితర పూజా కార్యక్రమాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం తెల్లవారుజామున సుబ్రహ్మణ్యేశ్వర పూజ, సామూహిక గోపూజ, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మహోత్సవం, సాయి లీలలు హరికథ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనుంజయ్య, ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, కోశాధికారి ఊరె కృష్ణయ్య, కుంభం పుల్లారెడ్డి, తడకమళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవు



కంపాసాగర్ గ్రామపంచాయతీలో విచారణ చేస్తున్న డీపీఎల్ఓ ప్రతాప్‌నాయక్

త్రిపురారం: గ్రామాభివృద్ధికి కేటాయించిన నిధుల దుర్వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీపీఎల్‌ఓ ప్రతాప్‌నాయక్ హెచ్చరించారు. శనివారం మండలంలోని కంపాసాగర్ గ్రామపంచాయతీకి ప్రభుత్వం కేటాయించిన నిధులు దుర్వినియోగం చేయడంతో పాటు, పంచాయతీ కార్యదర్శి విధులకు సక్రమంగా హాజరుకావడంలేదని గ్రామస్తులు కొందరు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా అధికారులు విచారణ చేసి పంచాయతీ రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అయినప్పటికీ గ్రామపంచాయతీ నిధులు దుర్వినియోగమవుతుండడంతో గ్రామస్తులు రెండోసారి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో శనివారం డీపీఎల్‌ఓ విచారణ చేసి రెండోసారి పంచాయతీ రిరాకర్డులను స్వాధీనం చేసుకున్నారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విచారణకు వచ్చిన డీపీఎల్‌ఓకు గ్రామస్తులు విన్నవించారు. కలెక్టర్‌కు నివేదిక అందజేసి కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మట్టయ్య, కొండ భాస్కర్, సింగం సైదులు, మేధారి సైదులు, అవిరెండ్ల అశోక్, కందిమళ్ల వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడిగా పుట్టల దినేష్



పుట్టల దినేష్‌కు నియామక పత్రం అందజేస్తున్న బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాడి రాజు

మిర్యాలగూడ అర్బన్: బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) మిర్యాలగూడ నియోజకవర్గ అధ్యక్షుడిగా పుట్టల దినేష్‌ను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పుడారి సైదులు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా శనివారం మిర్యాలగూడ పట్టణంలో జరిగిన ఓ కార్యక్రమంలో దినేష్‌కు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాడి రాజు నియామక పత్రం అందజేశారు. అంతేకాకుండా ఇన్‌చార్జిలుగా కుందారపు రమేష్, కాంతి కుమార్‌ను నియమించారు. కార్యక్రమంలో నిర్మల, అదిమల్ల గోవర్ధన్, కత్తుల కాన్షీరాం, కవిత తదితరులున్నారు.

పూడికతీత పనులు వేగవంతం చేయాలి



డ్రెయినేజీ పూడికతీత పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ భార్గవ్

మిర్యాలగూడ టౌన్: మున్సిపాలిటీలోని బంగారుగడ్డ, హనుమాన్‌పేట ప్రధాన డ్రెయినేజీలలో పేరుకుపోయిన మట్టితో పాటు పిచ్చి చెట్లను తొలగించే పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అన్నారు. శనివారం పట్టణంలోని సుందర్‌నగర్ వద్ద ప్రధాన డ్రెయినేజీ(నాలా) పూడికతీత పనులను ప్రారంభించిన అనంతరం కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలువలో నీళ్లు నిల్వ ఉండకుండా ఉండే విధంగా పూడికతీత పనులను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మగ్దూం పాష, నాయకులు దుర్గారావు, కోల వెంకన్న, కందగట్ల అశోక్, సుధాకర్, యల్లయ్య, రాంబాబు, నాగేందర్ తదితరులున్నారు.

బీఎస్పీలో చేరిక



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

హాలియా: ఎంఎస్‌ఎఫ్ జిల్లా నాయకుడు ముదిగొండ వెంకటేశ్వర్లు తన అనుచరులతో కలిసి శనివారం హైదరాబాద్‌లో బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సమక్షంలో, నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమల్ల వెంకటేష్ ఆధ్వర్యంలో బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషిచేయాలని ఆయన అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, అగ్రవర్ణ పేదలను పార్టీలో చేర్పించేందుకు ప్రతి కార్యకర్త కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు తంగెళ్ల సత్యనారాయణరాజు, పెద్దవూర, గుర్రంపోడు మండలాల అధ్యక్షులు కుక్కమూడి ముత్యాలు, కొమ్ము రమేష్, పార్టీ సీనియర్ నాయకుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రోడ్డుపై లారీలు ఆపి ధాన్యం తరలింపు



పెద్దవూర పోలీస్ స్టేషన్ ముందు లారీలను ఆపుతున్న తహసీల్దార్ సైదులుగౌడ్

పెద్దవూర: లారీల కొరతతో రోజుల తరబడి ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే ఉంటున్నాయి. దీంతో మండలంలోని పులిచర్ల, పెద్దవూర, నాయినివానికుంట, చలకుర్తి గ్రామాలలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చిన రైతులు ఆగ్రహంతో రోడ్లపైకి వచ్చి రాస్తారోకో చేస్తున్నారు. పోతునూరు స్టేజీ వద్ద రెండు రోజుల పాటు రైతులు జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. తహసీల్దార్ సురిగి సైదులుగౌడ్, సీఐ భీషన్న, ఎస్ఐ పచ్చిపాల పరమేష్ రైతులతో మాట్లాడి లారీలను పంపిస్తామని హామీ ఇచ్చినా, లారీలు రావడం లేదు. దీంతో శనివారం సాయంత్రం తహసీల్దార్ సురిగి సైదులుగౌడ్ స్థానిక పోలీస్ స్టేషన్ ముందు పోలీసులతో కలిసి సాగర్– హైదరాబాద్ రహదారిపై ఖాళీగా వెళ్తున్న లారీలను ఆపించి లారీ యజమానులతో ఫోన్‌లో మాట్లాడి ఆయా కొనుగోలు కేంద్రాలకు ఆరు లారీలను పంపించారు. దీంతో రోజులుగా కొనుగోలు కేంద్రాలలో ఉన్న వడ్ల బస్తాలను హమాలీల సహాయంతో లోడ్ చేయించి మిల్లులకు పంపించారు. దీంతో రైతులు తహసీల్దార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

షాపులను తొలగించాలని కమిషనర్‌కు వినతి



కమిషనర్ వీరారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

హాలియా: మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో పేరూర్ రోడ్డు నుంచి నూతనంగా బీటీ రోడ్డు పనులు జరుగుతున్నందున రోడ్డుకు ఇరువైపులా ఉన్న షాపులను తొలగించాలని కౌన్సిలర్లు శనివారం మున్సిపల్ కమిషనర్ కందిమళ్ళ వీరారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ.. పేరూర్ రోడ్డులో కొందరు రోడ్డును ఆక్రమించుకొని అక్రమంగా షాపులను ఏర్పాటు చేసుకున్నారన్నారు. ప్రస్తుతం మూడవ వార్డు నుంచి ఆంజనేయతండా వరకు నూతనంగా బీటీ రోడ్డు మంజూరై రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నందున 3, 4వ వార్డుల్లో రోడ్డుకు ఇరువైపులా అక్రమంగా ఏర్పాటు చేసుకున్న షాపులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో మున్సిపల్ చైర్‌పర్సన్ గౌరవ సలహాదారు వెంపటి శంకరయ్య, 3వ వార్డు కౌన్సిలర్ అన్నెపాక శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వర్ర వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎంపీడీఓకు వినతి

దేవరకొండ: మండల పరిధిలోని కొండభీమనపల్లి పంచాయతీ కార్యదర్శి ప్రజలకు సరిగ్గా అందుబాటులో ఉండటం లేదంటూ తెలంగాణ మాదిగ హక్కుల దండోరా జిల్లా అధ్యక్షుడు ఎర్ర ఆంజనేయులు శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శి అందుబాటులో ఉండకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఆడపిల్లలకు చదువే ఆయుధం

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ఆడపిల్లలు జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే చదువే ఆయుధమని ఐసీడీఎస్ సీడీపీఓ గంధం పద్మావతి అన్నారు. శనివారం మండలంలోని రాజవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్వరక్ష డే నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ పద్మావతి మాట్లాడుతూ.. మన ఇంటి పెరట్లో ఔషధ మొక్కలు పెంచితే ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందవచ్చని అన్నారు. ఇంధనం, నీరు, విద్యుత్‌ను ఎలా పొదుపు చేయాలో ఆమె వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ యాదమ్మ, సర్పంచ్ సైదమ్మ, మంజుల, అంగన్‌వాడీ టీచర్ లలిత, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూముల హక్కు పత్రాలు వెంటనే ఇవ్వాలి

అడవిదేవులపల్లి: అటవీ భూములు సాగులో ఉన్న రైతులకు హక్కు పత్రాలను వెంటనే ఇవ్వాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కొర్ర శంకర్‌నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన గిరిజన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అటవీ భూముల హక్కు పత్రాలను ఇస్తామని సర్వే చేయించి నెలలు గడుస్తున్నప్పటికీ నేటి వరకు కూడా హక్కు పత్రాలు ఇవ్వలేదన్నారు. ఉల్సాయిపాలెం గ్రామ పరిధిలోని తాటిచెట్టుతండా, గాంధీనగర్‌తండా గిరిజన రైతులకు రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు పాసుపుస్తకాలు రాకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించి ఆ భూముల లెక్క తేల్చాలన్నారు. సీపీఎం, గిరిజన సంఘం పోరాటాల ఫలితంగానే అటవీ భూములు సాగుచేసుకుంటున్న రైతులకు కొత్త పాసుపుస్తకాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జటంగి సైదులు, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి కొర్రా సైదానాయక్, గిరిజన సంఘం నాయకులు రమావత్ హనుమంతునాయక్, సర్వయ్య తదితరులున్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

మాడ్గులపల్లి: పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మాడ్గులపల్లి ఎంపీపీ పోకల శ్రీవిద్య అన్నారు. మండలంలోని పాములపహాడ్ పీహెచ్‌సీలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన జన ఆరోగ్య సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో సిబ్బంది పనితీరు, రోగులకు అందుతున్న వైద్య సేవలపై చర్చించారు. ఆస్పత్రిలో అత్యవసర వసతులు, వైద్య పరికరాలు సమకూర్చుకునేందుకు ఆమోదం తెలు పుతూ తీర్మానం చేశారు. సమావేశంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సంజయ్‌కుమార్, ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, సర్పంచ్ యాతం లక్ష్మి, పోకల రాజు పాల్గొన్నారు.

ఆరోగ్య తెలంగాణే సీఎం కేసీఆర్ లక్ష్యం

అడవిదేవులపల్లి: ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా కేసీఆర్ ముందుకు వెళ్తున్నారని ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్, జెడ్పీటీసీ సేవ్యానాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో నిర్వహించిన జన ఆరోగ్య సమితి సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షరీఫ్, డాక్టర్ ఉపేందర్, సర్పంచ్ మర్రెడ్డి, పకీరానాయక్, బాలు, ఎంపీటీసీ నాగమణి, ఐసీడీఎస్ సుపర్‌వైజర్ నాగమణి, విజయలక్ష్మి, వీఎస్ రెడ్డి, కృష్ణవేణి తదితరులున్నారు.

కొనసాగుతున్న వీఓఏల సమ్మె

పెద్దవూర: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 34వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుముల దుర్గయ్య మాట్లాడుతూ.. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, కనీస వేతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయిని లక్ష్మి, పాతనబోయిన పద్మ, సుహాసిని, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

పెద్దవూర: మండలంలోని చింతపల్లితండాకు చెందిన జటావత్ జగన్‌నాయక్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మన్నెం రంజిత్‌యాదవ్ సర్పంచ్ సుంకిరెడ్డి ప్రభావతిసంజీవరెడ్డి ఆధ్వర్యంలో జగన్‌నాయక్ దశదిన కర్మకు కావాల్సిన క్వింటాల్ బియ్యంతో పాటు నగదును శనివారం అతడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు నరేందర్‌నాయక్, మెండె సాంబయ్య, జానపాటి సైదులు, ఐతబోయిన వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని రాజవరం గ్రామం జంగాల కాలనీవాసులకు ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వారికి ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కొర్ర శంకర్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి జంగాల కాలనీలో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది సంవత్సరాలవుతన్నా నేటికీ నియోజకవర్గంలో ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు కట్టకపోడం సిగ్గుచేటని విమర్శించారు. కాలనీలో తాగటానికి నీళ్లు, కరెంట్ సదుపాయం లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు వేములకొండ పుల్లయ్య, గోపాల్, వెంకన్న, దుర్గమ్మ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

జయవీర్‌రెడ్డి పరామర్శ

నిడమనూరు: మండలంలోని రాజన్నగూడేనికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మండలి చినలింగయ్య పెద్ద కుమారుడు విజయ్ ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నేత కుందూరు జయవీర్‌రెడ్డి శనివారం చిన లింగయ్యను పరామర్శించి విజయ్ మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. ఆయన వెంట పీసీసీ సభ్యుడు ముంగి శివమారయ్య, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్, మజ్జిగపు దయాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.